క్లుప్తంగా

వ్యవసాయ విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామ్మోహన్ ఆదివారం తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల,ఆకుమల్ల,పేరుసోముల,నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె,గిద్దలూరు,ఆర్.లింగందిన్నె,రామిరెడ్డిపల్లె,మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

బేతంచెర్ల: తుపాను ప్రభావంతో మండలంలో కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామ్‌మోహన్, నాయకులు కిట్టన్న కోరారు. పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. టీడీపీ కూటమి రైతులకు, కౌలు రైతులకు ఇస్తామన్న హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

బేతంచెర్ల: మండలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ నెల 22న ఎంబాయి, అంబాపురం, హెచ్.కొట్టాల, బేతంచెర్ల-1, 2 గ్రామ సచివాలయాలు, 23న సీతారామాపురం, గోర్లగుట్ట, బేతంచెర్ల-3 గ్రామ సచివాలయం, 24న గోరుమానుకొండ, సిమెంట్ నగర్ - 1, 2 గ్రామ సచివాలయాలు, బేతంచెర్ల-4వ గ్రామ సచివాలయం, కొలుములపల్లె, 25న ముద్దవరం, ఎం.పేండేకల్లు, ఆర్.కొత్తపల్లె, గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం -1, 2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపుల్లో కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్, ఈ ఆధార్ వంటి సేవలు అందించనున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండి శాంతియుత జీవనం గడపాలని సీఐ వెంకటేశ్వరావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా కఠిన చర్యలు తప్పవన్నారు. నేరమయ జీవితానికి దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

బస్సు-లారీ ఢీకొని డ్రైవర్, కండక్టర్‌కు గాయాలు



నందికొట్కూరు రహదారిపై ఢీకొన్న ఆర్టీసీ బస్, లారీ

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు-గార్గేయపురం మధ్య భారత్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు-లారీ ఢీకొన్నాయి. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలుకు వెళ్తున్న ఆత్మకూరు ఆర్టీసీ డిపో బస్సు, నందికొట్కూరు వైపు వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్ డ్రైవర్ ప్రసాద్‌తోపాటు, కండెక్టర్ సరస్వతికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్ డ్రైవర్, కండెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ చెప్పారు.

ముందుకు పోలేం .. వెనక్కి రాలేం

- ట్రాఫిక్ పద్మవ్యూహంలో డోన్ పట్టణం
- నానాటికి తీవ్రమవుతున్న సమస్య
- పోలీసు, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం



రైల్వే గేటు వద్ద స్తంభించిన ట్రాఫిక్



పాతబస్టాండ్‌లో ప్రధాన రహదారికి అడ్డంగా నిలిపిన వాహనాలు

డోన్: లక్షకు పైగా జనాభా గల డోన్ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఏటేటా పెరుగుతున్న జనాభా, ద్విచక్ర వాహనాల సంఖ్యతో పాటు ట్రాఫిక్ సమస్య కూడా అధికం కావడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

రెండు రైల్వే గేట్లే ప్రధాన సమస్య

డోన్ పట్టణ నడిబొడ్డున కర్నూలు-గుంతకల్, నంద్యాల-గుంతకల్ వైపు వెళ్లేందుకు ప్రధాన రైల్వే మార్గాలు ఉండటంతో ఏళ్ల క్రితం ప్రజల సౌకర్యార్థం రెండు ప్రధాన రైల్వే గేట్లను వాహనాలు, ప్రజల రాకపోకలకు అనుగుణంగా ఏర్పాటుచేశారు. నాటి ట్రాఫిక్‌కు నేటి ట్రాఫిక్‌కు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉండటంతో వాహనదారులు ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక ట్రాఫిక్‌లో చిక్కుకొని సతమతమవుతున్నారు. ప్రధాన రహదారులను రాజకీయ ఒత్తిళ్ల మూలంగా అనుకున్నంత వెడల్పు చేయకపోవడం, ఉన్న ప్రధాన రహదారులకు ఇరువైపులా చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమైంది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా భారీగా పెరిగిపోవడం, వివిధ పనులపై పట్టణానికి వచ్చిన వారు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో సమస్య మరింత జఠిలంగా మారింది.

సమన్వయ లోపం

ట్రాఫిక్ సమస్యను నియంత్రించడంలో పరస్పర సహకారంతో పనిచేయాల్సిన పోలీసు, మున్సిపల్ అధికారులు ఎవరికి వారే యమునాతీరే అనే విధంగా వ్యవహరిస్తుండటంతో సమస్య నానాటికి తీవ్రరూపం దాలుస్తోంది. ఉన్నతాధికారులు ఇటీవల మొక్కుబడిగా ఉన్న సిబ్బందితోనే ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుచేసి మమ అనిపించారు. సిబ్బంది కొరత వల్ల.. వాహనాలు అత్యంత వేగంగా నడపడం, ఎక్కడపడితే అక్కడ నిలపడాన్ని నిరోధించలేకపోతున్నారు.

చాలా సమయం వృథా అవుతోంది



అత్యవసర పనుల నిమిత్తం పట్టణంలో ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లాలంటే ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకొని చాలా ఆలస్యమవుతోంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, పాదాచారుల పరిస్థితి చెప్పలేని విధంగా మారింది. ఏటేటా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది.

– బాషా, ఆటోడ్రైవర్, డోన్

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు ?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డోన్ పట్టణంలోని రెండు రైల్వే గేట్ల కింద నుంచి పాతపేట, చిగురుమానుపేట, బేతంచెర్ల రోడ్డు ప్రాంతాలకు అండర్‌పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే ప్రస్తుత టీడీపీ పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ పనులను నిలిపివేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నాం.

– బోయ సుమలత సురేష్, కౌన్సిలర్, డోన్

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరుచుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు ఆదివారం దాతల సహాయంతో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీను, పక్కీరమ్మ సహాయంతో రోగులకు రొట్టె, గుడ్లు, పప్పు పంపిణీ చేశారు. ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్‌ప్రభాకర్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

బేతంచెర్ల: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం, మోడల్ స్కూల్లో వంట మనిషి, వాచ్‌మన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం నంద్యాలలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఎంఈఓ సోమశేఖర్ ఆదివారం తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు నంద్యాల పట్టణం డేనియల్ పురంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని ఎంఈఓ సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు.

‘సూపర్ సిక్స్’ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు ధ్వజమెత్తారు. మండల పరిధిలోని దొరపల్లి గ్రామంలో ఆదివారం సీపీఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాలను గాలికి వదిలేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని చెబుతూ రాష్ట్ర ప్రజలను గందరగోళం పట్టించారన్నారు. ఢిల్లీకి పోయి వచ్చిన తరువాత జమిలీ ఎన్నికల గురించి మాట్లాడుతున్నాడన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరోమాట మాట్లాడుతున్నాడని విమర్శించారు. పథకాల అమలుపై కాలయాపన చేస్తే ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, సమితి సభ్యులు ప్రభాకర్, వరదరాజులు, విజయుడు, కృష్ణ, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన శిరీష ఈ నెల 18వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను ఆదివారం అరెస్టు చేశారు. శిరీషను హత్య చేసిన గొల్ల కురుమన్న, వేధింపులకు పాల్పడిన భర్త గొల్ల నరసింహులు, అత్త గొల్ల మహేశ్వరిని పట్టణ సమీపంలోని ఉర్దూ మదర్సా వద్ద అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ చెప్పారు.

కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రామ్మోహన్

డోన్ రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక నక్కి రామన్న భవనంలో చేతి వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతి వృత్తిదారులను ఆదుకుంటామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా హామీలు అమలు చేయడంలేదన్నారు. కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి చేతి వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 22న నంద్యాల జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి చేతి వృత్తిదారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. చేతివృత్తి దారులు రాఘవేంద్ర, సిద్దు, నాగసుబ్బయ్య, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

డోన్ టౌన్: 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ప్యాపిలి మండల స్వర్ణోత్సవ మహాసభలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. మెరుగైన ఫిట్మెంట్ ప్రకటించి, బకాయిలను చెల్లించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : ప్యాపిలి మండల శాఖ గౌరవాధ్యక్షులుగా శేషయ్య, అధ్యక్షులుగా రమేష్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా నాగమణి, ఖలీల్, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, కోశాధికారిగా మధు, మరికొందరిని మండల కార్యదర్శులు, ఆడిటర్, జిల్లా కౌన్సిలర్లగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు శాంతిప్రియ, ప్రసాద్, రామ్మూర్తి, రఘునాయక్ తదితరులు ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్



భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం



సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంగన్న

అభివృద్ధి పనులకు భూమిపూజ

బేతంచెర్ల: మండల పరిధిలోని యం.పెండేకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెండేకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటగిరి, రేపల్లె గ్రామాలను కలుపుకొని రూ.30 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఐక్యంగా ఉండి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

బనగానపల్లె : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద జమ్మిరెడ్డి కాలనీ, బంగారమ్మతోట, కరీంబాగ్ ఎన్జీవో కాలనీ, వృద్ధాశ్రమం ఏరియాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, పీఆర్ రమణ, ఈఓ సతీష్ కుమార్‌రెడ్డి,ఉపసర్పంచ్ బురానుద్దీన్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొలిమిగుండ్లలో సీసీ రోడ్లకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి పోస్టాఫీసు వరకు రూ.20 లక్షలు, పీహెచ్‌సీ సమీపంలో రూ.20లక్షలతో మరో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. పంచాయితీ రాజ్ ఏఈ అన్వర్‌హుసేన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవుకు: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మెట్టుపల్లె గ్రామంలో రూ.10లక్షలతో, గోకులదిన్నె గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీడీఓ వెంగన్న భూమిపూజ చేశారు. హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కార్డన్‌సెర్చ్



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట, కొండపేటలో ఆదివారం తెల్లవారుజామున డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్ బృందాలుగా ఏర్పడి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆయా కాలనీల్లో అనుమానితులు, పాత రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారి ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మట్కా, నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, గంజాయి, మత్తు పదార్థాలు తదితర వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని, నిషేధిత ఉత్పత్తులను వినియోగించినా, అమ్మకాలు చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్ల సిబ్బందితో పాటు క్యూఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి

ప్యాపిలి: రౌడీషీటర్లు తీరు మార్చుకుని నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నేరాలతో సంబంధం ఉన్న విషయాల్లో రౌడీషీటర్లు తమ ప్రమేయం లేకుండా చూసుకోవాలన్నారు. కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉన్న వారి పేర్లను ఉన్నతాధికారులకు సిఫారసు చేసి రౌడీషీట్ నుంచి తొలగిస్తామన్నారు.

ఫౌంటెన్ కాదు!



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న మంచినీరు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని మటన్ మార్కెట్‌కు వెళ్లే దారిలో జుర్రేరు వాగు వంతెనపై పైప్‌లైన్ లీకేజీ కారణంగా మంచినీరు వృథా పోతోంది. ఈ పైప్‌లైన్ ద్వారా పట్టణ ప్రజలకు మంచినీరు సరఫరా అవుతుంది. పైప్‌లైన్ జాయింట్ల మధ్యలో నీరు లీకవుతూ కొద్ది రోజుల నుంచి నీరు వృథాగా పారిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

- రూ. 142 కోట్ల కేంద్ర నిధులతో డబుల్ లేన్ రోడ్లు
- రోడ్ల నిర్మాణమంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే
- జిల్లాలో 62.50 కి.మీ. డబుల్ లేన్ రోడ్ల నిర్మాణం



రూ.30 కోట్లతో డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించనున్న పేరుసోముల- పెట్నికోట రోడ్డు

జిల్లాలో డబుల్‌లేన్ రోడ్లుగా మార్చేందుకు మంజూరైన నిధులు..

రహదారి	కి.మీ.	మంజూరైన నిధులు
సంజామల- పేరుసోముల	14.20 కి.మీ	రూ.29 కోట్లు
సంజామల- కోవెలకుంట్ల,	8.3 కి.మీ	
ముక్కమల్ల- అవుకు,	3 కి.మీ	రూ.29 కోట్లు
నందివర్గం-ఎస్.కొత్తూరు	5 కి.మీ	
తిమ్మనాయినిపేట- అంకిరెడ్డిపల్లె	13.8 కి.మీ	రూ.29 కోట్లు
పేరుసోముల- పెట్నికోట	12.6 కి.మీ	రూ.30 కోట్లు
బనగానపల్లె- పాణ్యం కేబీ బీరోడ్	5.6 కి.మీ	రూ.25 కోట్లు

కోవెలకుంట్ల: జిల్లాలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న గ్రామీణ రోడ్లకు మోక్షం కల్గింది. రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ (కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి) నిధులు మంజూరు చేయడంతో మహర్దశ పట్టుకుంది. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం వసూలు చేసే రహదారి అభివృద్ధి సెస్‌ను ఆయా రాష్ట్రాల్లోని రోడ్ల అభివృద్ధికి వెచ్చిస్తోంది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 62.50 కి.మీ. మేర డబుల్‌లేన్ రోడ్ల నిర్మాణానికి రూ.142 కోట్లు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఏడు రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు పంపగా కేంద్రం నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, పాణ్యం, బనగానపల్లె మండలాల్లోని వివిధ రహదారులను విస్తరించాల్సి ఉంది. ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లో ఏడు మీటర్ల వెడల్పుతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్లు రోడ్ల నిర్మాణం పూర్తి చేశాక రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు చేస్తే ఆ నిధులను కేంద్రం రీయింబర్స్ చేస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రహదారులకు నిధులు మంజూరయ్యాయి. వివిధ కారణాలతో రోడ్డు నిర్మాణ పనులు జాప్యం కావడం, 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ ఏడాది రోడ్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పనులకు మార్గం సుగమమైంది. బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో పలు సింగల్‌రోడ్లు డబుల్ రోడ్లుగా మార్పు చెందనుండటంతో నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు వెళ్లేందుకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ముందు భాగన గరుడాల్వార్ ఆకారం



గరుడ ఆకారంలో పర్వతుడు!

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ముందు భాగన స్వామి వారి పాదాల కింద సహజ సిద్ధంగా గరుడ ఆకారంలో వెలసిన కొండ భక్తులను కనువిందు చేస్తోంది. గరుడాద్రిని తలపిస్తుండటం, ఆలయం ముందు భాగన స్వామి వారిని మోస్తున్నట్లుగా కొండ ఉండటంతో భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– బేతంచెర్ల